దూరం.. మాకు భారం!

- విలీనం పేరిట ప్రాథమిక పాఠశాలలకు ఉరి
- ఎస్ఎంసీ కమిటీలపై ఒత్తిడి చేస్తున్న అధికారులు
- దూరంగా ఉన్న స్కూళ్లకు పిల్లలను పంపించలేమంటున్న తల్లిదండ్రులు



శ్రీకూర్మంలోని పొందరవీధి పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు

గార : విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. సంస్కరణల పేరిట సర్వనాశనం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ప్రీ స్కూల్ విధానంలో మార్పులపై గ్రామాల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ప్రభుత్వంలో జీవో117కు సంబంధించిన సవరణ మెమోతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రుల గందరగోళానికి గురవుతున్నారు. జీవోలో పేర్కొన్నట్లు కిలోమీటరు దూరం పైబడి దూరం ఉన్న పాఠశాల వద్దకు విద్యార్థులను తీసుకెళ్లడం, మళ్లీ తీసుకురావడం ఇబ్బందిగా ఉంటుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధానం కొనసాగితే విద్యార్థులు డ్రాపౌట్స్‌గా మారే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవో 117ను సరళీకరణ పేరుతో మరింత క్లిష్టతరం చేస్తున్నారని మండిపడుతున్నారు.



గత నెలలోఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

ప్రమాదాలకు ఆస్కారం..

గార మండలంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, జెడ్పీ హైస్కూల్ కలిపి 98 పాఠశాలలున్నాయి. మండల పరిధిలో ఆరు క్లస్టర్లు ఉండగా వాటి పరిధిలో పాఠశాలల విలీన ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఎస్ఎంసీ తీర్మానాలు, అభిప్రాయాలు తెలుసుకోవాలని ఒక పక్క ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాల అంటూనే కొన్ని పాఠశాలలను విలీనం చేసేస్తున్నారు. దీంతో ఏకోపాధ్యాయ స్కూళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామంలో ఉండే పాఠశాలలను ఆదర్శ స్కూల్ పేరిట విలీనం చేయడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో కూర్మనాథాలయం సమీపంలో పొందర వీధి, కంద్ర వీధి ప్రైమరీ పాఠశాలల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇక్కడ 66 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆదర్శ పాఠశాల పేరిట కిలోమీటరు దూరం ఉన్న పాఠశాలలో విలీనం చేయడం తగదని ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

పిల్లలెలా రోడ్డు దాటుతారు..?



పొందవీధి పాఠశాలలో నాడు- నేడు పథకం కింద అన్ని వసతులు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్కూల్ కంటే సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు మరో స్కూల్‌కి పిల్లలను పంపమని చెబుతున్నారు. ఆ రోడ్డు ఎప్పుడు బిజీగా ఉంటోంది. పిల్లలు ఆ రోడ్డును ఎలా దాటగలరు?

– దామోదర హేమలత, పొందరవీధి ఎస్ఎంసీ అధ్యక్షురాలు

వసతులున్న స్కూల్‌ను వదిలేయాలా?



రెండేళ్ల కిందట మా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పుడేమో వేరే పాఠశాలకు పంపాలని చెబుతున్నారు. పిల్లలను ఆ పాఠశాలకు తీసుకెళ్లి వెళ్లి తిరిగి తీసుకురావాలంటే పనులన్నీ మానుకోవాలి. చాలా ఇబ్బందిగా ఉంటోంది. ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించుకోవాలి.

– తర్ల మణికుమారి, ఎస్ఎంసీ ఉపాధ్యక్షురాలు, శ్రీకూర్మం

ఉపసంహరించుకోవాలి



స్కూల్ విలీనం పేరిట వింత పోకడలు అవలంబించడం సమంజసం కాదు. దీనివల్ల విద్యార్థులు దూరంగా స్కూల్‌కు వెళ్లలేక ఇబ్బందులు పడతారు. పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులకే అవస్థలే. ఇలాగే కొనసాగి చివరికి డ్రాపౌట్లుగా మారే ప్రమాదముంది. ప్రభుత్వం దృష్టిసారించి విలీన ప్రక్రియను నిలిపివేయాలి.

– అంధవరపు రామలక్ష్మి, వైస్ ఎంపీపీ, గార మండలం

తీర్మానం మేరకే..



పాఠశాల విలీనంపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ నిర్ణయమే పరిగణనలోకి తీసుకుంటాం. ఇప్పటికే అభిప్రాయ సేకరణ చేయమని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఎస్ఎంసీ ఇష్టం లేకుండా విలీనం చేయడం జరగదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయానికి ప్రాధాన్యతనిస్తాం. గతంలో వినతి పత్రాలు అందించినా, మరోసారి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఎస్ఎంసీ సభ్యులు తమ సమ్మతిని తెలియజేయవచ్చు.

– ఎస్.రామకృష్ణ, ఎంఈవో-1, గార

క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి కల్యాణ సేవ మంగళవారం ఉదయం అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఫాల్గుణ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీ వారి కల్యాణమూర్తులకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వై.భద్రాజీల ఆధ్వర్యంలో ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, ఈవో వై.భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు



గర్భకోశ చికిత్సలు చేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్యాంపాలెం గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. 55 పశువులకు చికిత్సలు చేసి రైతులకు మినరల్ మిక్చర్లు అందజేశారు. కార్యక్రమంలో జేడీ రాజగోపాల్, డీడీ రామ్మోహన్, సత్యప్రకాశ్, పశుసంవర్ధక అధికారి దిలీప్, శరత్ పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై దృష్టిపెట్టాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ పాపినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ ఎచ్చెర్ల ప్రాజెక్టు అధికారి దోల పాపినాయుడు అన్నారు. కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోషణ, పూర్వ విద్యపై అవగాహన సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లు దాటిన ప్రతి ఒక్కరికి పూర్వ ప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సూపర్‌వైజర్లు అరుణకుమారి, శరణ్య సోర్సుపర్సన్లుగా వ్యవహరించారు.


ఫుడ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఫుడ్ కంట్రోల్ అధికారులు

శ్రీకాకుళం: అపరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. ఇలిసిపురం ప్రధాన రహదారిలో హోటల్ అయ్యప్ప ఫుడ్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం తనిఖీ చేశారు. వంటకాల్లో కృత్రిమ రంగులు కలిపినా, చైనాసాల్ట్ వినియోగించినా, అపరిశుభ్ర ప్రదేశంలో విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. ఆయనతోపాటు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని కిల్లిపాలెం ప్రాంతంలో చెరువులు, సాగునీటి కాలువలు, రోడ్లు, డ్రైనేజీ పనులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం పరిశీలించారు. చెరువుల పరిరక్షణ, సాగునీటి కాలువల పనులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లోకి కూటమి వైఫల్యాలు



మెంటాడ స్వరూప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నం కేంద్రంగా యువజన విభాగం విస్తృత స్థాయి సమావేశాన్ని జోనల్ ఇన్‌చార్జి మెంటాడ స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా యువజన విభాగం సంస్థాగత నిర్మాణం, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కమిటీల ఏర్పాటు, ఉత్తరాంధ్రలో యువజన విభాగం పటిష్టతపై నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, నమ్మక ద్రోహాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ యువజన విభాగం కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృథ్వీ, నియోజకవర్గ అధ్యక్షుడు గుండ హరేష్, నర్తు ప్రేమ్‌కుమార్, దన్నాన హరి, దండి జయప్రకాశ్, చిన్ని జోగారావు, వి.హరికృష్ణ, మేడపల్లి భరద్వాజ్, యల్ల శ్రీనివాసరావు, అల్లు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆన్‌లైన్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మూడు విభాగాల పోస్టులకు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్, చిలకపాలేం శ్రీశివానీ కాలేజీల కంప్యూటర్ ఆన్‌లైన్ సెంటర్‌లలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. భద్రత, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటివి పరిశీలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అసిస్టెంట్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విశ్లేషకుడు గ్రేడ్-2, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరలో ఉదయం 100 మందికి 50 మంది, మధ్యాహ్నం 68 మందికి 27 మంది హాజరయ్యారు. శివానీ కాలేజీలో ఉదయం 124 మందికి 68 మంది, మధ్యాహ్నం 69 మందికి 38 మంది పరీక్షకు హాజరయ్యారు.

వైభవంగా ఊరేగింపు



ఊరేగింపులో వేషధారణలు



అమ్మవారి కలశాలతో ఊరేగింపు



శూలాధారణలో భక్తులు



భక్తుడి విన్యాసం

నగరంలోని పెద్దరెల్లివీధికి చెందిన భక్తులు మంగళవారం వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. నూకాలమ్మతల్లి మాలాధారణ చేసి శూలాధారణతో పెద్దరెల్లివీధి నుంచి కలెక్టర్ బంగ్లారోడ్డులోని నక్కవీధి వద్ద ఉన్న నూకాలమ్మతల్లి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది.

– శ్రీకాకుళం కల్చరల్

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పౌరసరఫరాల శాఖ ఆధీనంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థి శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాసముంటూ కనీస విద్యార్హత డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు అర్హులని అధికారులు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్హతలు కలిగి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ఈ నెల 27 నుంచి దరఖాస్తులు పొంది పూరించిన వాటిని ఏప్రిల్ 2లోగా అందజేయాలని కోరారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని, అంగవైకల్యం కలిగిన వారు అనర్హులని స్పష్టం చేశారు.

సామాజిక తనిఖీల ప్రజావేదిక నేడు

రణస్థలం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై రణస్థలం మండలంలో 17వ విడత సామాజిక తనిఖీల ప్రజావేదిక సమావేశం రణస్థలం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విజయగణపతికి ప్రత్యేక పూజలు



స్వామికి హారతులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిబంధనలను పాటించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం శ్రీకాకుళం పట్టణంలో గ్లోబల్ పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు బైఠాయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రావు, సీహెచ్ రవి మాట్లాడుతూ కోర్సుల పేరిట అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. నిరసన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ జిల్లా సహాయ కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు మోహన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



చిలకపాలెంలోని దివ్యాంగుల కాలనీ సమీపంలో సీసీ రోడ్డుపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సమయంలో వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

రంగనాథునికి విశేష అలంకరణ



ఫరీదుపేటలోని భూ, నీలా, గోదా, ఆళ్వార్ సహిత రంగనాథస్వామి ఆలయ 51వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సీతారాముల కల్యాణం అనే బుర్రకథ ప్రదర్శించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వెంకన్నకు జన్మనక్షత్ర పూజలు



పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వంశీ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, నిజరూప దర్శనాలు, అలంకరణ, హోమాదులు జరిగాయి.

– శ్రీకాకుళం కల్చరల్

ఘనంగా అసిరిపోలమ్మ పండగ



ముద్దాడతో పాటు సమీప ప్రాంత గ్రామాల్లో మంగళవారం అసిరి పోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఘనంగానిర్వహించారు. బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వైభవంగా రామమందిరం వార్షికోత్సవం



పూజలందుకుంటున్న స్వామివారు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని కంద్రవీధిలో కోదండ రామమందిరం ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. భద్రం బాబు, గురూజీ శ్రీ రామ్‌చరణ్‌దాస్ మహారాజ్ ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫాల్గుణ బహుళ పక్ష ఏకాదశి పర్వదినం సందర్భంగా అర్చకులు తారకరామశర్మ, నల్ల కూర్మన్నాచార్యులు ఆధ్వర్యంలో వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

జనావాసాల్లో కోళ్లఫారం పెడితే చర్యలు



పనులు అడ్డుకుంటున్న సచివాలయ సిబ్బంది

రణస్థలం: జనావాసాల మధ్య కోళ్ల ఫారం పెడితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ప్రసాద్ అన్నారు. జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీ సమీపంలో కోళ్లఫారం ఏర్పాటుపై స్థానికులు పంచాయతీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సంబంధిత ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రజల ఆమోదయోగ్యం లేకుండా కోళ్లఫారం పెట్టరాదని నిర్వాహకులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్‌లోని కాకినాడ శ్రీ ఆదిత్య (కో-ఎడ్యుకేషన్) డిగ్రీ కళాశాల విద్యార్థులు విప్రో టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో సత్తాచాటారు. రికార్డుస్థాయిలో 106 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను సంస్థల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్.వి. వేణుగోపాల్ అభినందించారు. ఎంపికైన వారికి ప్రారంభంలోనే రూ.2.5 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీజీవీ సుబ్రహ్మణ్యం, ప్లేస్‌మెంట్ అధికారి ఆర్.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

29న కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 29న సాయంత్రం 4గంటలకు జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కవులు ఈ నెల 28లోగా 63031 36182 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కాంప్లెక్స్‌కు కొత్త కళ



క్రేన్ సహాయంతో రంగులు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ముస్తాబవుతోంది. 12 సంవత్సరాల క్రితం వేసిన రంగులు వెలిసిపోవడంతో మళ్లీ రంగులు వేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంప్లెక్స్ ఆవరణలోని మరుగుదొడ్లకు కూడా తెలుపు వేయడంతో సరికొత్తగా కనిపిస్తున్నాయి.

రామాలయంలో ఏకాదశి పూజలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలో సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరం చివరి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి ఉమామహేశ్వర్‌శర్మ నేతృత్వంలో వేకువజాము నుంచి స్వామివారికి సుప్రభాత సేవ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.